ENTERED

# ఛీ! నాన్న పెళ్లి చేసుకొన్నాడా? కథ

## (సింగారం-బంగారం అను ఇండో-అమెరికన్ కథ)



"ఛీ! నాన్న పెళ్లి చేసుకొన్నాడా!!!" గత ఆదివారం నుండి ఈ ఆదివారం వరకు, ఒక లక్ష రెండువేల మూడువందల, నలభై అయిదోసారి, కోపం, ఆక్రోశం, ఉక్రోషం, అపరాధభావం, అవమానభారంతో కలిసిన ఆశ్చర్యానికి గురైయింది, ఇండోఅమెరికన్ వనిత అనిత. అమెరికాలో న్యూ జెర్సీ రాష్ట్రంలో బ్రిడ్జ్ వాటర్ పట్టణంలో జెనైన్‌వే కాలనీలో, తొమ్మిదో క్రాస్ రోడ్‌లో రెండో నంబరు, టౌన్ హౌస్‌లో గ్రౌండు ఫ్లోర్‌లోని. కిచెన్‌లో ప్రతి ఆదివారంలానే కష్టావధానం, అష్టావధానం చేస్తూ, ఇంటి పని. వంట పనులతో సతమతమవుతూ కూడా.

## చేగొండి రామజోగయ్య

అనిత, అనంత్ ధర్మపత్ని. అనంత్‌కి గ్రీన్ కార్డు వచ్చేసినందున, న్యూ జెర్సీలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. అనిత కూడా అక్కడే వేరే ఉద్యోగం చేస్తున్నందువలన సొంత ఇల్లు ఏర్పాటు చేసుకుని. అమెరికాలో దాదాపు స్థిర నివాసులైపోయారు. రెండేళ్లకోసారి మాత్రం 'భారత్ దర్శనానికి' సంతోషంగా వస్తుంటారు. ఏమైనా ఇద్దరూ, 'భారతీయత' చాలా వరకూ నిలుపుకున్నారని చెప్పటానికి నిదర్శనం ఉద్యోగం చేస్తున్నా, ఇంటి పనీ, వంట పనీ ఎక్కువగా అనితే చేస్తూండటం!

అనిత, భరతఖండం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వాస్తవ్యులు, రిటైర్డు ప్రిన్సిపాల్, సింగారం నాయుడుగారి గారాలపట్టి. తల్లి చిన్నప్పుడే చనిపోయినందువల్ల. తండ్రి నాయుడు గారి ఆలన, లాలన, పాలనలో గారంగా పెరిగింది. తల్లి గురించి పెద్దగా సొంత జ్ఞాపకాలు లేవు కాని, కొంత పెద్దయ్యాక. 'వాళ్లూ వీళ్లూ' మాట్లాడుకొంటే విని, తన తల్లి ఎప్పుడూ, అనారోగ్యంతో ఉండేదని, దానికి తోడు ఐశ్వర్యవంతుల కుటుంబం నుంచి వచ్చానన్న అహంభావం ఉండి, భర్తతో పెద్ద సాపత్యంగా ఉండేది కాదని, తెలుసుకొంది.

తల్లి పోయిన కొత్తలో ఎవరో పెద్దమ్మ వరసైన ముసలావిడ, వాళ్లింట్లో ఉండేది. ఇతగాడిని నీకేం తక్కువ మళ్లీ పెళ్లి చేసుకోమని సలహా ఇస్తున్న వెధవలు చాలా మందున్నారు. వాళ్ల మాటలకు లొంగిపోయి, పొంగిపోయి, మళ్లీ పెళ్లి చేసేసుకొంటాడో ఏవిటో ఈ పిల్లకు సవతి తల్లి యాతన రాసిపెట్టుందో ఏవిటో కర్మ అని తరుచుగా గొణుక్కొంటూ ఉండేది, అనిత వినేలా. 'ఈ పిల్ల' మీద ప్రేమ కన్నా, నాయుడుగారు పునర్వివాహం చేసేసుకుంటే ఈ ఇంట్లో ఇంకో ఆడది ప్రవేశిస్తే తన ప్రాబల్యం తగ్గిపోతుందన్న దుగ్ధే కారణం, ఆ గొణుగుడికి. అయితే అప్పటికి ఏడేళ్ల లేతవయసున్న అనితపై మాత్రం మానసికంగా చాలా దుష్ప్రభావం పడింది. తనకీ ఒక విధమైన అహంభావం కలిగేది. అంతే గాక, స్కూల్లో సవతితల్లులు పెట్టే హింసల వంటి కొన్ని కథలు వినటంతో, అనిత, 'సవతి తల్లితో ఉపద్రవం' అన్న ఫోబియాకి లోనయేది. ఎప్పుడూ నాన్న గదిలోనే పడుకొనేది. అప్పుడప్పుడూ సవతి తల్లి పెట్టే బాధలకు సంబంధించిన పీడకలలు కూడా కని, వెంటనే నాన్న పక్కలోకి దూరిపోయి, ఆయన్ని కరిచిపెట్టుకొని పడుకొనేది. అయితే వయసుతో పాటు పెరిగిన అవగాహన వలన తన భయాల్ని మాత్రం ఎవరితో పంచుకునేది కాదు. మనసులోనే దాచుకొనేది. ఈ క్రమంలో తండ్రికి బాగా చేరువైపోయింది. దాదాపుగా నాన్న కూచి అయిపోయింది.

ENTERED

కూతురిలో గూడుకట్టుకొన్న అభద్రతాభావాన్ని అర్థం చేసుకొన్నందువలనో, ఇతరకారణాల వలనో గాని, నాయుడు గారు మాత్రం, ఎవరెంత నచ్చజెప్పజూసినా, బలవంతం చేసినా, పునర్వివాహం ఊసే తలపెట్టలేదు. ఏకైకసంతానం అనితే తన సర్వస్వంగా జీవనం సాగించేరు. అయినా సమయం వచ్చినప్పుడు, ప్రేమను పక్కన పెట్టి బాధ్యతకే పెద్ద పీట వేసేరు. కుమార్తె యుక్తవయస్కురాలై ఉన్నతవిద్యాభ్యాసం పూర్తి చేసిన వెంటనే, ఆలస్యం చేయకుండా, బంగారం లాంటి అమెరికా సంబంధాన్ని కుదిర్చేరు. అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్న బంగారం వారబ్బాయి, అనంత్‌కిచ్చి వైభవంగా పెళ్లి చేశారు. కండువాతో కళ్లు తుడుచుకొంటూ అమ్మాయిని విమానం ఎక్కించారు. ఇది అనిత కూడా ఇష్టపడి చేసుకున్న పెళ్లి. తను చదివింది మేనేజ్‌మెంట్ కోర్సే అయినా, కొంచెం దూరదృష్టితో, ఇండియాలో ఉన్నప్పుడే, కొన్ని కంప్యూటరు కోర్సులు చేసివున్నందున, తను కూడా అమెరికాలో తగిన ఉద్యోగం సంపాదించుకొని, భర్తతో దాదాపు సమంగా వేతనం పొందసాగింది. అయితే ముందే చెప్పుకొన్నట్లుగా భారతీయవనిత గాబట్టి, ఉద్యోగభారానికి అదనంగా ఇంటి చాకిరి, పెద్దగా మగని సాయం కోరుకోకుండా ఆనందంగా చేయసాగింది. పెళ్లై అయిదేళ్లయినా ఇంకా పిల్లల్ని ప్లాన్ చేయలేదు. సొంత ఇంటి కోసం తీసుకొన్న అప్పు పూర్తిగా తీరే వరకు, ఆ విషయం వాయిదా వేసేరు, అనిత, అనంత్.

అనితాసింగారం అమెరికాలో అలా ఆనందంగా సంసారం చేసుకొంటున్నా, సర్వీసు లోంచి రిటైరైపోయి, కేవలం ఒక వంటవాడిని మాత్రం పెట్టుకొని, లంకంత ఇంట్లో దాదాపు వొంటరి జీవితం గడుపుతున్న నాన్నని తలుచుకొని, బాధపడని రోజుండదు! అలానే, అయన ఎంత ధర్మపరుడో, ఎంత నిష్ఠాగరిష్ఠంగా జీవితం గడుపుతూ అన్నీ తనే అయి, తనను ఎలా పెంచి పెద్ద చేశాడో, భర్త అనంత్‌కి మాత్రమే కాదు, పరిచితులు, మిత్రులందరికీ, ఎన్నిసార్లు చెప్పుకుని మురిసిపోయినా తనివి తీరదు అనితకు.

అన్నట్లు సింగారం నాయుడు గారమ్మాయి అనిత తన ఇంటి పేరు ఇప్పటికీ, సింగారంగానే ఉంచుకొన్నది. పాస్ పోర్టులోనూ, అన్ని సర్టిఫికెట్లలోనూ అలానే ఉంది. కాబట్టి తనకూ, 'సింగారం' అన్న ఇంటి పేరే ఇష్టం గాబట్టి! మరి అనంత్ ఇంటి పేరు 'బంగారం' కదా బంగారం అన్నా ఇష్టం.

అనితాసింగారం, అనంత్ బంగారం మన దంపతులు సార్థకనామధేయులు. వీళ్ల అన్యోన్యతను చూసి, భారతీయమిత్రులంతా "సింగారం, బంగారం భలే కాపురం" అని మెచ్చుకొంటూ వుంటారు. ఆఫీసు వాళ్లు, ఇతర అమెరికన్ పరిచితులు నోరు తిరక్క అమెరికన్ ఆక్సెంటుతో, "మిసెస్ సిమ్‌గారమ్, మిస్టర్ బన్‌గారమ్" అంటారు. అక్కడంతా బాగా చనువుంటే తప్ప, ఇంటి పేర్లతోనే పిలుస్తారు. అనిత ఇంకా సన్నజాజి తీగలాగా సన్నగానే ఉంటుంది గాబట్టి, కొంత మంది ముచ్చటగా మిసెస్ స్లిమ్‌గారమ్, స్లిమ్‌గార్ల్ అని కూడా పిలవటం తనకెంతో ఆనందంగా ఉంటుంది. అప్పుడప్పుడు మొగుణ్ని "వాట్ మిస్టర్ బన్‌గారమ్‌ఏ" అని పిలుస్తుంది గారంగా, "బన్" అని నొక్కిపలుకుతూ. అనంత్ కొద్దిగా బొద్దుగా ఉంటాడు లెండి! మళ్లీ తనే "నా బంగారం" అనుకొని మురిసిపోతుంది.

అనితాసింగారం అమెరికాలో అలా ఆనందంగా సంసారం చేసుకొంటున్నా, సర్వీసు లోంచి రిటైరైపోయి, కేవలం ఒక వంటవాడిని మాత్రం పెట్టుకొని, లంకంత ఇంట్లో దాదాపు వొంటరి జీవితం గడుపుతున్న నాన్నని తలుచుకొని, బాధపడని రోజుండదు! అలానే, అయన ఎంత ధర్మపరుడో, ఎంత నిష్ఠాగరిష్ఠంగా జీవితం గడుపుతూ అన్నీ తనే అయి, తనను ఎలా పెంచి పెద్ద చేశాడో, భర్త అనంత్‌కి మాత్రమే కాదు, పరిచితులు, మిత్రులందరికీ, ఎన్నిసార్లు చెప్పుకుని మురిసిపోయినా తనివి తీరదు అనితకు.

ఇక నాయుడుగారికి, కూతురు చాలా దూరం వెళ్లిపోయిందన్న బాధ ఒక పక్కన ఉన్నా, తన కాపురం ఆనందమయంగా ఉందన్న తృప్తి వలన, ప్రతీ ఆదివారం తను ఫోను చేసి ఒక అరగంట పైన అన్ని విషయాలు సన్నిహితంగా మాట్లాడుతోంది గాబట్టి సరిపెట్టుకోగలుగుతున్నారనే చెప్పాలి.

రోజూ ఒక ఎత్తు, ఆదివారం ఒక ఎత్తు. అంత పనుంటుంది అమెరికాలోని భారతీయగృహిణులకు, వారమంతా భర్తలతో సమానంగా ఉద్యోగరీత్యా బిజీగా ఉండేవాళ్లతో సహా! మొగుళ్లయితే సిసలైన భారతీయపురుషులు గాబట్టి, వారాంతపు ఇంటి పనంతా స్వయంగా చేసుకొనే స్వేచ్ఛను, ఉదారంగా అర్ధాంగులకే వదిలిపెట్టి, తాము టెన్నిస్ ఆడుకోవటంలోనో, భారతీయభాషల్లోని సినిమా కేసెట్లు చూడటంలోనో, ఇంటర్నెట్ వీక్షణతోనో, హాయిగా గడిపేస్తారు ఆదివారాల్ని. అంతే గాని ఇంటి పనిలో భార్యలకు సాయం చేసేవాళ్లు తక్కువే ఉంటారు!

అనితకి కూడా ప్రత్యేకంగా ఆదివారాల్లో ఇంటి పని చాలా ఉంటుంది. మొదట్లోనే, చెప్పుకొన్నట్లు, ఈ ఆదివారం ఉదయం కూడా, ఇంటి పని, వంట పని, వాషింగు మిషన్‌తో చాకిరేవు పని, ఇల్లంతా వాక్యూమ్ క్లీనింగ్ చేసుకొంటూ, టీవీలో లోకల్ ఛానల్‌లో హిందీ పాటల డాన్సుల ప్రోగ్రాం ఆన్ చేసుకొని, చూడకుండా అన్యమనస్కంగా వింటూ అష్టావధానం, కష్టావధానం చేస్తున్న ఈ యమ బిజీ సమయంలో కూడా, గత ఆదివారం నుండి తనను కలవరపరుస్తున్న 'పెళ్లి వార్త' మళ్లీ గుర్తుకు వచ్చి, గుండెల్లో గుచ్చుకొని, "ఛీ! నాన్న పెళ్లి చేసుకున్నాడా?" అని పైకే అనేసింది, మరోసారి! అలవాటు ప్రకారం ఈ ఆదివారం ఉదయం న్యూ జెర్సీ టైమ్ జోన్ సమయం ప్రకారం పదకొండు గంటలకు, అంటే భారతీయకాలమానం ప్రకారం, రాత్రి తొమ్మిది గం టలకు ఇండియాలో, అదే భీమవరంలో ఒంటరిగా ఉండే నాన్నకు ఫోను చేయాల్సిన సమయం దాటిపోయినా, అన్యమనస్కంగానే ఉండిపోయింది గాని, ఫోను దరిదాపుల్లోకి వెళ్లలేదు అనిత.

మనసు నిండా నాన్న గురించే ఆలోచనలు. కాని ప్రతీ ఆదివారంలా, ఈ రోజు మాత్రం ఫోను చేయడానికి మనస్కరించటం లేదు. తనకు తెలుసు, ప్రతీ ఆదివారం తప్పని సరిగా కూతురు నుండి వచ్చే ఈ కాల్ కోసం, నాన్న ఎంత ఆత్రుతతో ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లో ఫోను దగ్గరే తచ్చాడుతూ ఉండిపోతాడని. కూతురు ఎంతో ఆప్యాయంగా మాట్లాడే ఈ అరగంట, గంట సమయాన్ని ఎంతో అపురూపంగా చూసుకొంటారు, ఇద్దరూను. ఎంతో సన్నిహితంగా మాట్లాడుకొంటారు. ఓ సారి నాయుడుగారు "ఏంట్రా, మనవడినిచ్చేదెప్పుడ్రా బాబూ?" అంటే కిలకిలా నవ్వేసి, "ఇప్పుడప్పుడే వద్దు లే నాన్నా. ముందు ఇంటి మీదా, ఇద్దరి కార్ల మీదా ఉన్న అప్పు తీరాలి. బ్యాంకులో ఖాతా లక్ష డాలర్లకి చేరుకోవాలి. ఇంకో రెండు సంవత్సరాలేసుకో" అని చెప్పేసింది, అరమరికల్లేకుండా. అమ్మ ఉన్నా, చెప్పుకోలేకపోయేదాన్నేమో అనుకొనే విషయాలు కూడా, నాన్నతో మనసు విప్పి చెప్పుకొంటుంది, పంచుకొంటుంది. అన్నీ సరిగా ఉంటే ఈ వారం. "నేను త్వరలో నీళ్లోసుకొంటానోచ్!" అని డిక్లేర్ చేసి, అనంత్ మగపిల్లాడ్ని కోరు

కొంటున్నా, తనకు మాత్రం ఆడపిల్లనే కనాలని ఉందని చెప్పవలసిన మాట. కాని ఫోను చేయడానికే మనస్కరించడం లేదు అనితకు.

ఎలాగో వంట పూర్తి అయిందనిపించి, పైన గదిలో వున్న అనంత్‌ని భోజనానికి పిలిచింది. కిందకి వచ్చిన అనంత్, ముఖం, కళ్లు ఉబ్బిపోయి చాలా దైన్యంగా కనబడుతున్న భార్యను చూసి, నిజంగానే చలించిపోయాడు. ఏవో ఓదార్పు మాటలు చెప్పాలనుకొన్నంతలోనే, గత ఆదివారం నుండి ఎన్నో సార్లు లోపలే అనుకొంటున్నది, ఈ సారీ పొరపాటున పైకే అనేసింది. "ఛీ! నాన్న పెళ్లి చేసుకున్నాడా?" అని. వెంటనే భోరున ఏడ్చేసింది... మనసులోనూ, గొంతులోనూ, సుళ్లు తిరుగుతున్న వేడి నీటి ఊటలా పైకి ఎగదన్నేసినందువలన.

ఏం చేయాలో, ఏం చెప్పాలో, ఎలా ఓదార్చాలో అర్థం కాని అనంత్, కొయ్యబారిపోయాడు. పెళ్లి వార్త చెప్పి అనితను అంతలా 'అప్‌సెట్' చేసింది తనే కదా-అని ఫీలవుతూ, గతవారం జరిగింది మననం చేసుకోసాగాడు.

అసలేం జరిగిందంటే...



గత ఆదివారం అనిత ఇంటి పని, వంట పని చేసుకొంటూనే నిర్దిష్టసమయానికి, నాన్నతో మాట్లాడుదామని ఫోను కలిపింది భీమవరానికి. కాని ఇంట్లో నాన్న లేడని ఆన్సరింగు మెషీన్‌లో వున్న మెసేజ్ ద్వారా తెలిసి, హతాశురాలైంది. ఆ 'మెసేజ్' సరిగా వినకుండానే, దభేల్‌మని ఫోను పెట్టేసింది, అంతు లేని నిరాశతో. తిరిగి ఇంటి పనిలో పడిపోయినా, ఏదో పోగొట్టుకొన్నట్టు ఫీలవుతూనే ఉంది. తనకు అలానే ఉంటుంది, ఏ వారమైనా నాన్నతో మాట్లాడలేకపోతే! పైగా ఆ వారం ఎన్నో ముఖ్యమైన విషయాలు నాన్నకు చెప్పి, సంతోషపరుద్దామని అనుకొంది. తనకు, భర్తకు, సాలరీ రైజ్ వచ్చిందనీ, మూడో వ్యక్తి రాకను ప్లాన్ చేసుకొంటామనీ.

ఆ సమయంలో టెన్నిస్ ఆట నుంచి వచ్చిన అనంత్, వంట ఇంకా పూర్తి కాలేదని గమనించి, మేడ పైకి వెళ్లిపోయి, కంప్యూటర్‌లో ఇంటర్నెట్ ఓపెన్ చేసి, ఆ రోజు భారతీయపత్రికలు, ముఖ్యంగా తెలుగు దినపత్రికలు, చూడసాగాడు. మన ప్రధానదినపత్రికలన్నింటికీ, ఇంటర్నెట్ ఎడిషన్‌లున్నాయి. అంటే ప్రపంచంలో ఎక్కడున్నవాళ్లయినా, మన దినపత్రికలను ఆసాంతం, కంప్యూటర్ స్క్రీన్ పైకి రప్పించుకొని చూడవచ్చు అంటే చదవొచ్చన్నమాట! మన దేశంలోనే, కొన్ని మారుమూల పల్లెలకు, దినపత్రికలు ఒక పూట ఆలస్యంగా చేరుతాయి. అయితే ఎక్కడో అమెరికాలోనో, కెనడాలోనో ఉన్న ప్రవాసభారతీయులు, ఏ రోజు పేపరును ఆ రోజే చదువుకొని తాజా వార్తలు తెలుసుకోగలరన్నమాట! ఇది సమాచారవిప్లవంలో ఒక పార్శ్వం!

గత ఆదివారం అనంత్ ఒక తెలుగు దినపత్రిక మెయిన్ ఎడిషన్ సాంతం చదివేసి, పశ్చిమ గోదావరి జిల్లా ఎడిషన్ కోసం క్లిక్ చేసి, తన కంప్యూటర్ స్క్రీన్ పైకి తెచ్చుకున్నాడు. అనితలానే అతనూ పశ్చిమ గోదావరి జిల్లావాడే. మొదటి పేజీలో ప్రచురితమైన ఒక ఫొటో చూసి, ఆశ్చర్యచకితుడయ్యాడు. కళ్లు నులుముకొని మళ్లీ మళ్లీ చూశాడు. అది పెళ్లి ఫోటో అని నిర్ధారించుకొన్నాడు. "అనితా!" అని పైనుంచి పిలిచాడు... కాదు, అరిచాడు.

"ఏమిటి బంగారం వంటైపోవచ్చింది ఒక్క క్షణం!" మామూలుగానే అంది అనితాసింగారం.

"ఆ అది కాదు మరి ...మరి మీ నాన్న పెళ్లిచేసుకొన్నాడు" బాంబు పేల్చేడు!

"వ్వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్? బ్లడీ!" ఇంకా ఏదో గర్జించబోయి, తమాయించుకొంది అనితాసింగారం. తనకూ నాన్నంటే ఎంతో గౌరవం. నన్ను సొంత కొడుకులా చూసుకొంటారు. ఆయన చాలా గొప్ప వ్యక్తి అని అందరికీ చెప్పుకొనే అనంత్, ఇలా వాగుతున్నాడేమిటి? అమ్మ పోయి ఇన్నేళ్లయి, ఎవరెలా చెప్పినా, బలవంతపెట్టినా లొంగక, పెళ్లిచేసుకోవడానికి ఇచ్చగించని నాన్న, ఇప్పుడు అరవై మూడేళ్ల వయసు వచ్చాక మళ్లీ పెళ్లి చేసుకొంటాడా? అనంత్ ఇంత క్రూయల్ జోక్ వేసేదేమిటీ వేళ? ఇలా అయోమయంలో పడిపోయింది.

అనంత్ నెమ్మదిగా కిందికి వచ్చాడు. చేతిలో ఉన్న కాగితం భార్యకీయబోయాడు.

ఏమిటన్నట్లు ఉరిమి చూసింది అనిత అది అందుకోకుండానే.

"మరేమో తెలుగు డెయిలీ ఇంటర్నెట్‌లో చూస్తుంటే, వెస్ట్ గోడావరి ఎడిషన్‌లో మీ నాన్న పెళ్లి ఫోటో పడింది. ఇదిగో ప్రింటవుట్, డౌన్‌లోడ్ చేసి తీసుకొచ్చాను..."

అనంత్ మాటలకు మరింత అయోమయంలో పడిపోయింది నాయుడుగారి కుమార్తె అనిత.

"నాన్న పెళ్లి ఫోటోనా? అప్పుడెప్పుడో అయిపోయిన పెళ్లి ఫోటో ఇప్పుడెందుకు వేస్తారు, పనికట్టుకొని? అమ్మ వర్ధంతి రోజు కూడా దగ్గరలో లేదే!" విస్మయం చిందించింది.

"పాత పెళ్లి ఫోటో కాదు అనితా. మీ అమ్మతో పెళ్లిదీ కాదు... 'మళ్లీ పెళ్లి'దన్న మాట! ఇంకో అమ్మాయిని రెండ్రోజుల క్రితం చేసుకొన్నారన్నమాట! నేనూ నమ్మలేక పోతున్నాను. కానీ..."

ఇంకా ఏమో చెప్పబోతుంటే, అతని చేతిలోని కాగితాన్ని, అదే ప్రింట్ అవుట్‌ను లాక్కుంది.

ఫోటో చూసింది... మళ్లీ మళ్లీ చూసింది.

నిజమే! నాన్న మళ్లీ పెళ్లి చేసుకొన్నాడు!!! పేపరు మీద తేదీలు చూస్తుంటే, రెండ్రోజుల క్రితం జరిగిన పెళ్లని తెలుస్తోంది. కట్టుకొన్న బట్టల కన్నా ఎక్కువ తెల్లని జుట్టుతో, నాన్న ఫోటోలో ఎలా నవ్వుతున్నాడో... ఈ వయసులో పెళ్లి చేసుకొంటున్నానని, ఏ మాత్రం సిగ్గు పడకుండా! నవ్వుతుంటే కొన్ని పళ్లు ఊడిపోయున్నట్టు స్పష్టంగా కనబడుతోంది. పండిన ముసలితనం ఇంకా స్పష్టంగా కనబడుతోంది... మరి పెళ్లి కూతురు...?

నాన్న మెళ్లో దండ వేస్తున్న యువతికి 20 ఏళ్లుంటాయేమో... పోనీ పాతిక. ఏమైనా నాకన్నా చిన్నదే. కూతురి కన్నా చిన్నదైనదాన్ని, కూతురితో మాట మాత్రమైనా చెప్పకుండా, ఎలా పెళ్లి చేసుకోగలిగేడు? ఈ ముసలాయన సరదా సరే, ఆ పడుచు పిల్లకి ఏం పొయ్యేకాలం వచ్చింది? తన కన్నెరికం విడిపించడానికి నాన్నే దొరికాడా ఈ మహాతల్లికి? కర్మ! నాకు పిన్నై కూర్చుంది. ఛీ పాడు! అసలు ఆవిడెలాంటిదో...? కేవలం ఆస్తి కోసం కక్కుర్తి పడిందా? ఇలా అనిత మనసు పరిపరివిధాల సుళ్లు తిరిగింది.

(సశేషం)